క్లుప్తంగా

నేడు నీటి సంఘాల ఎన్నికలు

గాలివీడు/రామాపురం : నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గాలివీడు, రామాపురం మండలాల తహసీల్దార్‌లు భాగ్యలత, రామాంజనేయులు, రామాపురం ఇరిగేషన్ ఏఈ రెడ్డయ్యలు శుక్రవారం తెలిపారు. గాలివీడులో మూడు చెరువులు, రామాపురంలో మూడు చెరువుల ఎన్నికలు శనివారం జరిపించనున్నట్లు చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిపించేందుకు రైతులు, నాయకులు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

లక్కిరెడ్డిపల్లిలో..

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని పాలెంగొల్లపల్లి గ్రామం చిన్నకోతలపల్లి డ్యామ్, దిన్నెపాడు పెద్దచెరువుల నీటిసంఘం ఎన్నికలు నేడు (శనివారం) నిర్వహించనున్నట్లు మండల ఇరిగేషన్ ఏఈ మహబూబ్ బాషాలు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

సిద్దవటం : మండలంలోని భాకరాపేటలో ఉన్న జెడ్పీహెచ్ఎస్‌ను శుక్రవారం పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నాగిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యతలో ఎక్కడా రాజీపడకుండా విద్యార్థులకు భోజనాన్ని అందించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు



రాహుకాల పూజలలో పాల్గొన్న భక్తులు

రాయచోటి టౌన్ : పట్టణంలోని ప్రముఖ క్షేత్రం శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో కొలువైన భద్రకాళీ అమ్మవారికి శుక్రవారం రాహుకాల పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేసి పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి, నిమ్మకాయలపై వత్తులు వెలగించి హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్యస్వామి మాట్లాడుతూ రాహుకాల పూజలు నిర్వహించిన మహిళ మాంగల్యబలం పెరుగుతుందని తెలిపారు. పూజలలో పాల్గొన్న భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

శబరిమలైకు మాలధారులు



ఇరుముడులతో మాలధారులు

గాలివీడు : మండలంలోని పలు గ్రామాలకు చెందిన అయ్యప్ప మాలధారులు శుక్రవారం శబరిమలైకు బయలుదేరారు. 41 రోజుల దీక్షల అనంతరం స్థానిక శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో గురుస్వామి రామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వాములకు నేతి టెంకాయలతో ఇరుముడులు కట్టుకొని ప్రత్యేక బస్సులో హరిహర తనయుడికి తరలివెళ్లారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారి రవిబాబు

ఒంటిమిట్ట (సిద్దవటం) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశామని అడిషనల్ డీఎంహెచ్ రవిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని రికార్డులను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో జరిగే ప్రోగ్రామ్‌ల గురించి పీహెచ్‌సీ వైద్యురాలు హిమశ్వేతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని చిన్నకొత్తపల్లె గ్రామాన్ని సందర్శించి అక్కడ ఉన్న సంచార వాహనం(104) వద్దకు వచ్చిన రోగులను పరిశీలించారు. అలానే గ్రామంలోని పాఠశాలలో గల మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, వంట ఏజెన్సీ వారికి తగు సూచనలిచ్చారు. పాఠశాలలోని వాటర్ ట్యాంకును పరిశీలించి విద్యార్థులకు మంచినీరు అందించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయునికి తెలియజేశారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేసి ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్‌లకు సలహాలు చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రికి ప్రహరీ నిర్మించాలి

రాయచోటి టౌన్ : రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వెనుక భాగాన ప్రహరీ గోడను నిర్మించాలని సీపీఎం జిల్లా పార్టీ కమిటీ సభ్యులు ఏ.రామాంజులు డిమాండ్ చేశారు. శుక్రవారం కూలిన ఆస్పత్రి ప్రహరీ గోడను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 పడకల ఆస్పత్రి నిర్మాణాలు పూర్తిచేసుకొని సుమారు సంవత్సరం అవుతున్నా ఇప్పటి వరకు ప్రహరీ గోడ నిర్మాణాలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. వడ్డెర విద్యావంతుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతి ప్రసాద్ మాట్లాడుతూ ప్రహరీ, గేట్లు నిర్మించకపోవడంతో మందుబాబులకు, ఆకతాయిలకు అడ్డాగా మారుతోందని విమర్శించారు. అలాగే గైనిక్ విభాగానికి చెందిన భవనం కూలిన మట్టితో గోడలు బీటలు పడుతున్నాయన్నారు. అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం శాఖ కార్యదర్శి జి.మాధవయ్య, బి.రెడ్డెయ్య, ఎస్.ఖాదర్ వలీ, పామయ్య పాల్గొన్నారు.

కోతల సమయం.. వేదనా భరితం

- డిమాండ్‌కు తగ్గ మిషన్‌లు లేక రైతన్నకు తప్పని తిప్పలు
- కోత కోయాలంటే అధిక రేట్లు ఇవ్వాలంటున్న బ్రోకర్లు
- అడిగినంత చెల్లించకుంటే కోతలు చేయమంటున్న వైనం
- సబ్సిడీ కింద ప్రభుత్వం కోత మిషన్‌లు అందించాలని రైతుల విన్నపం



మండలంలోని వరి చేనులో పంటను కోస్తున్న మిషన్

లక్కిరెడ్డిపల్లి : కూలీల భారం, ట్రాక్టర్ల బాడుగ, ఎరువుల ధరలు, పురుగు మందుల ఖర్చులు, వరికోత మిషన్‌ల డిమాండ్‌కు తగ్గ అధిక బాడుగలతో రైతులకు సేద్యం బరువుగా మారిపోయింది. కాడెద్దులు కరువైపోవడంతో రైతు సేద్యం చేయాలంటే అప్పులు తప్పవని కూలీగా మారిపోయే దుస్థితి నెలకొంది. దీంతో ఎక్కడ చూసినా పంట పొలాలు సైతం బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. బోరు బావుల కింద అరకొరగా వరి సాగు చేసిన రైతుకు గిట్టుబాటు ధరలేక అల్లాడుతున్న పరిస్థితి.. వెరసి అధిక ఖర్చులతో సాగు అంటేనే రైతుల గుండెల్లో గుబులు పుడుతోంది. పంట పండి కోతకు వచ్చే సరికి వరికోత మిషన్‌లకు అధిక డిమాండ్‌తో బ్రోకర్లు అధిక సొమ్ములు వసూలు చేస్తూ రైతుల నడ్డి విరుస్తున్నారు. పక్క రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన మిషన్లు వారు చెప్పిందే వేదం లేదంటే కోయం అనేలా సాగుతోంది. కోత చేయకపోతే తుపాన్‌లు దాటికి పంట కాస్త వర్షార్పణం కాక తప్పని దుస్థితి.

పక్క రాష్ట్రాల నుంచి వరికోత మిషన్‌లు

అసలే కరువు ప్రాంతం ఆపై కరుణించని వరుణ దేవుడు. అరకొర పదునులు, వర్షాన్ని నమ్ముకొని బోరుబావుల కింద ఖరీఫ్‌లో సాగు చేసుకున్న వరిపంట కోతకు వచ్చే సమయానికి ప్రతి యేడు నవంబర్, డిసెంబర్ మాసాలలో తుపాన్‌ల దెబ్బకు వర్షార్పణం కాక తప్పడం లేదని వాపోతున్నారు. సమయానికి కూలీలు దొరకక రైతులు మిషన్ల కోసం రోజుల తరబడి ఎదురుచూస్తున్నామని పలువురు రైతులు వాపోతున్నారు. పక్క రాష్ట్రాల నుంచి వచ్చిన వరికోత మిషన్లకు మధ్యలో వచ్చిన బ్రోకర్లు గంట రేటును అమాంతంగా పెంచి వరి రైతును నట్టేట ముంచుతున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక ఎకరా వరికోత కోయాలంటే ఐదు గంటల సమయం వెచ్చిస్తున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వరికోత మిషన్ గంటకు రూ.3 వేలు నుంచి రూ. 3500లు వరకు రాబడుతున్నారని, ఒక రైతు పొలం నుంచి మరో రైతు పొలం వరకు వెళ్లే మార్గం వరకూ అధిక చార్జీలు వసూలు చేస్తూ దండుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. ప్రశ్నిస్తే ఆ రైతు పొలం వరకు మిషన్ రాదంటూ బెదిరిస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఎకరా రైతు పరిస్థితి ఇలా ఉంటే రెండు, మూడు ఎకరాలు ఆ పైబడి సాగు చేసిన రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారిందని చెప్పుకొస్తున్నారు. వరినారు పోసినప్పటి నుంచి నాట్లు మొదలుకొని కోత కోసి ధాన్యం ఇంటికి చేరేలోపు పెట్టుబడి అధికమై ఇంటికి చేరిన ధాన్యాన్ని విక్రయించాక వచ్చే దానికంటే ఖర్చు ఎక్కువగా అవుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఈ ప్రాంత రైతులకు సబ్సిడీ ద్వారా వరికోత మిషన్‌లను మంజూరు చేసి రైతులకు విరివిగా అందిస్తే బయట రాష్ట్రాల నుంచి వచ్చే వారి డిమాండ్ తగ్గుతుందన్నారు. కనీసం ప్రతి మండలానికి పది వరికోత మిషన్లును మంజూరు చేస్తేగానీ రాబోయే రోజుల్లో రైతులు వరి ధాన్యాన్ని తక్కువ ఖర్చులతో సాగుచేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎరువులు, పురుగు మందులను రైతులకు సబ్సిడీ ద్వారా అందజేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

గంటకు రూ. 3500లు చెల్లిస్తున్నాం



కరువుకాటకాలు నేపథ్యంలో అరకొర నాటుకున్న వరిపంట కోతుకు వచ్చే సరికి కూలీలు దొరకడంలేదు. వరికోత మిషన్ల ద్వారా కోయిద్దామనుకుంటే గంటకు రూ. 3500లు లేనిదే రాలేం అంటున్నారు. తమిళవాళ్లు బ్రోకర్లను ఏర్పాటు చేసుకొని ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. గంటకు ఎంత రేటు ఎందుకు అని ప్రశ్నిస్తే కోయడానికి రావడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ద్వారా వరికోత మిషన్‌లను మంజూరు చేస్తే మన ప్రాంత రైతులకు ఇబ్బందులు ఉండవు. లేదంటే వేలకు వేలు ఖర్చు పెట్టి కోత కోసుకోవాల్సిందే.

– రెడ్డిపోగు రమణయ్య, పాత మాదిగపల్లె, మద్దిరేవుల గ్రామం, లక్కిరెడ్డిపల్లి

సబ్సిడీపై వరికోత మిషన్‌లు ఇవ్వాలి



వరికోత మిషన్‌తో వరిపంట కోతకోయాలంటే పంట సాగు చేసినంత ఖర్చు వస్తోంది. బయట రాష్ట్రాల నుంచి వరి కోత మిషన్లు తీసుకువస్తున్నందున బ్రోకర్లు రైతుల నడ్డివిరుస్తున్నారు. మన ప్రాంత రైతులకు వరికోత మిషన్‌లను సబ్సిడీకి ఇస్తే బయట వారిని అడుక్కునే పరిస్థితి ఉండదు. పంట కోతకు రాగానే తుపాన్‌లను తప్పించుకొని ధాన్యం ఇంటికి చేర్చుకోవచ్చు. ప్రభుత్వం చొరవచూపి బ్రోకర్లను అరికట్టి వరి రైతులను ఆదుకోవాలి.

– మల్లి రెడ్డయ్య, వరి రైతు, ఎగువ వడ్డిపల్లి, కుర్నూతల గ్రామం, లక్కిరెడ్డిపల్లి

వెల్లివిరిసిన మతసామరస్యం



మాలధారులకు భిక్షను వడ్డిస్తున్న ముస్లింలు

గాలివీడు : మండల కేంద్రంలోని గేటు వద్దనున్న శ్రీ రామాలయంలో అయ్యప్ప స్వాములకు స్థానిక అమీర్ టీవీఎస్ షోరూం యజమాని ఎస్‌కే నిజాముద్దీన్, అమీన్ మెడికల్స్ షాపు యజమాని అమీన్, ముస్లిం సోదరులు అన్నదానం చేసి మత సామరస్యాన్ని చాటారు. అయ్యప్ప స్వాములు వారిని నిండు మనసుతో ఆశీర్వదించారు. అయ్యప్ప స్వాములకు నిజాం అమీన్‌లు స్వయంగా వడ్డించారు. అనంతరం వారు కూడా అక్కడే భిక్ష చేశారు. మత సామరస్యాన్ని చాటుతున్న ముస్లిం సోదరులకు స్వాములు ధన్యవాదాలు తెలిపారు.

జెడ్పీహెచ్ఎస్‌లో పేరెంట్స్ మీట్



మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ హరిక్రిష్ణయ్య

సిద్దవటం : మండలంలోని భాకరాపేటలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లోని జెడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ సమావేశం జరిగింది. కమిటీ చైర్మన్ హరిక్రిష్ణయ్య మాట్లాడుతూ ఇటీవల అధికారులు విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యత లోపం ఉందని గుర్తించి వంట ఏజెన్సీ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశామన్నారు. శుక్రవారం జరిగిన సమావేశానికి పిల్లల తల్లిదండ్రులు 16 మంది హాజరయ్యారని వీరిలో 14 మంది తల్లిదండ్రులు వంట ఏజెన్సీని మార్చాలని వారి అభిప్రాయాన్ని సమావేశంలో చెప్పారన్నారు.

రెవెన్యూ సదస్సుల వల్ల ఒరిగిందేమీలేదు



మాట్లాడుతున్న పండుగోల మణి

రైల్వేకోడూరు అర్బన్ : జిల్లాలో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల వలన నిరుపేద దళిత, గిరిజనులకు ఒరిగిందేమీలేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పండుగోల మణి శుక్రవారం విమర్శించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల వలన దళిత, గిరిజనులకు ఒరిగిందేమీలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. కూటమి పార్టీల నాయకులు అధికారులను బెదిరిస్తూ తమ పనులు చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన ఓ నాయకుడి పేరు చెప్పుకుంటూ పలువురు గిరిజనులపై దౌర్జన్యాలు చేసి వారి భూములను ఆక్రమించుకుంటున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని తెలియజేశారు. ఈ సంఘటన రెవెన్యూ యంత్రాంగానికే సిగ్గు చేటన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి భూ కబ్జాదారులపై చర్యలు తీసుకొని గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. లేని పక్షంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి జయరామయ్య, ఉపాధ్యక్షులు ఎం.రమణయ్యలు పాల్గొన్నారు.

'కబ్జాలో ఉన్న ఇంటిని మాకు ఇప్పించండి'



గోడు వెళ్లబోసుకుంటున్న జీతానాయక్

రాజంపేట : తమ ఇంటిని తమకు ఇప్పించాలని, ఎంతో కాలంగా మా పేరుతో ఇల్లు పక్కాగా రిజిస్టర్ అయిన, తన ఇంట్లోకి సుమత్రి అనే వ్యక్తి దౌర్జన్యంగా ఉంటున్నారని బాధితుడు నియోజకవర్గంలోని సుండుపల్లెకు చెందిన జీతా నాయక్ శుక్రవారం ఆరోపించారు. అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండల కేంద్రంలో తమకు సర్వే నంబరు 610లో ఇంటి నెంబరు 2/780–4గా నమోదు కాబడిన మొలింగ్ మిద్దె, కరెంట్ మీటర్ నెంబరు 4124గా ఉన్న ఆస్తి తనదన్నారు. సుండుపల్లె రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తమకు డాక్యుమెంట్ నెంబరు 10888/2017గా తన పేరుతో రిజిస్టరు చేయబడిందన్నారు. తన ఇంటిని తనకు ఇప్పించాలని అనేకమార్లు కోరుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. పదేపదే ప్రాధేయపడి అడుగుతున్న అక్రమంగా తమ ఇంటిని కబ్జా చేసుకున్నారని వాపోయారు. ఇంటికి సంబంధించిన పత్రాలు తమ వద్ద పక్కాగా ఉన్నాయన్నారు. ఇంటిని ఖాళీ చేయాలని ఆక్రమణదారులకు పలుమార్లు తెలియజేసిన రౌడీయిజానికి దిగుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు తమకు రక్షణ కల్పించాలని ప్రాధేయపడుతున్నారు. ఇప్పటికే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

రెవెన్యూ సదస్సుకు 25 అర్జీలు



సమస్యలు వింటున్న డిప్యూటీ తహసీల్దార్

పుల్లంపేట : మండలంలోని రామసముద్రం రెవెన్యూ గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గ్రామంలో ప్రజల నుంచి 25 అర్జీలు అందాయని, వాటిని సంబంధిత అధికారులకు పరిష్కరించేందుకు బదిలీ చేశామన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు

పుల్లంపేట : ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామాల అభివృద్ధి శిక్షణా తరగతిని నిర్వహించారు. పేదరిక నిర్మూలన, ఆరోగ్యవంతమైన గ్రామం, క్లీన్ అండ్ గ్రీన్, మౌలిక సదుపాయాల కల్పన, సుపరిపాలన కల్గిన గ్రామం తదితర అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీధర్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి

సిద్దవటం : గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు కృషి చేయాలని డీఎల్‌పీఓ విజయభాస్కర్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం రెండవ రోజు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ విజయభాస్కర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు స్థానికంగా లభించే వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మెహతాజ్ యాస్మిన్, ఎంఈఓ-2 అరుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవిద్య, అధికారులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

పెనగలూరు : గ్రామాల అభివృద్ధిపై సిబ్బంది దృష్టి పెట్టాలని ఏపీఓ ఆదిప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలోని సచివాలయ సిబ్బందికి, సర్పంచ్‌కు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందేందుకు దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా తాగునీరు, పరిశుభ్రత, ఆరోగ్యం, ప్రభుత్వ పథకాలు, ఇతర అంశాలపై ప్రత్యేక దృష్టిపెడితే ఆ పంచాయతీ ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నిరంజన్, ఎంఈఓ గిరి వరదయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి

లక్కిరెడ్డిపల్లి : గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని గ్రామీణ ప్రాంత అభివృద్ధి మండలి రాష్ట్ర పరిశీలకులు భార్గవి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి గ్రామాల అభివృద్ధిపై రెండోరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదరికం నిర్మూలించాలంటే గ్రామాలు అభివృద్ధి చెందాలన్నారు. సామాజిక, రాజకీయ జీవన విధానాలను మెరుగుపరుచుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎంపీడీఓ రెడ్డన్న, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీ సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో నీటి కష్టాలు



ఇంటి నిర్మాణానికి నీటి ట్యాంకర్‌ను వినియోగిస్తున్న లబ్ధిదారు

పుల్లంపేట : మండలంలోని అనంతంపల్లి పంచాయతీలో ఉన్న జగనన్న కాలనీకి 33 లబ్ధిదారులకు గృహాలను గతంలో మంజూరు చేశారు. ప్రస్తుతం జగనన్న కాలనీలో నీరు లేకపోవడంతో లబ్ధిదారులు శుక్రవారం ట్యాంకర్లు ద్వారా నీటి తెచ్చుకుని నిర్మాణ పనులకు వినియోగిస్తున్నారు. జగనన్న ప్రభుత్వంలో బోరు, మోటారు, రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. అయితే ప్రస్తుతం నీటి బోరు నిరుపయోగంగా ఉంది. ఈ విషయంపై గతంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం పక్కా గృహాలు నిర్మాణం చేయకుంటే పట్టా రద్దు చేస్తామని చెప్పడంతో సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు అప్పులు తెచ్చుకుని పనులు చేయిస్తున్నారు. కాలనీలో కనీస వసతులు లేవని ఇప్పటికైనా అధికారులు వసతులు కల్పించి ఆదుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

జర్నలిస్టులపై దాడి అమానుషం



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే సంఘం సభ్యులు

సుండుపల్లె : వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని వేముల మండల కేంద్రంలో నీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ కవరేజ్‌కు వెళ్లిన సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాసులు, కెమెరామెన్ రాము, సాక్షి పత్రిక రిపోర్టర్ రాజారెడ్డిలపై దాడి అమానుషమని సుండుపల్లె మండల జర్నలిస్టులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జర్నలిస్టులపై దాడిని నిరసిస్తూ ఏపీయూడబ్ల్యూజే మండల ప్రధాన కార్యదర్శి భూపయ్య ఆధ్వర్యంలో దాడి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దార్ దైవాధీనంకు వినతిపత్రం అందజేసి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు నిజాలు అందించడం జర్నలిస్టుల కర్తవ్యం అని, ఇందులో భాగంగా నీటి సంఘాల ఎన్నికల కవరేజ్ కోసం వెళ్లిన మీడియా ప్రతినిధులపై దాడి చేయడం దుర్మార్గం అని చెప్పారు. దాడి చేసిన ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు యూసుఫ్, కార్యనిర్వాహక కార్యదర్శి అరుణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు వెంకటేష్, గోపాల్, రవీంద్రరాజు, కర్ణ, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

దాడి కారకులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న భాస్కర్

రాజంపేట టౌన్ : వైఎస్సార్‌జిల్లా వేముల మండలంలో నీటి సంఘాల ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన న్యూస్‌ను కవరేజీ చేసేందుకు వెళ్లిన 'సాక్షి'టీవీ జర్నలిస్ట్ శ్రీనివాస్, కెమెరామెన్ రాముతో 'సాక్షి' దినపత్రిక రిపోర్టర్ రాజారెడ్డిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని రాజంపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బచోటి భాస్కర్ డిమాండ్ చేశారు. స్థానిక ఓ ప్రైవేట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉండే పాత్రికేయులపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి దాడులు మరోమారు రాష్ట్రంలో ఎక్కడా జరగకుండా ఉండాలంటే దాడిచేసిన వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఎంతైనావుందన్నారు. దాడిచేసిన వారిపట్ల ఉదాసీనతగా వ్యవహరిస్తే రాష్ట్రంలో జర్నలిస్టులు స్వేచ్ఛగా తమ విధులను సైతం నిర్వహించుకోలేరని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు శివయ్య, ఓబులేసు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు నిండిన చెరువులు



ఓబులవారిపల్లె: అలుగుపారుతున్న జిల్లేలమడక చెరువు




పుల్లంపేట: నిండుకుండలా రంగంపల్లి చెరువు

ఓబులవారిపల్లె : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా పారడంతో మండలంలోని దాదాపు అన్ని చెరువులు అలుగుపారాయి. మండల కేంద్రంలోని జిల్లేలమడక చెరువు శుక్రవారం నిండి అలుగుపారింది. చాలా సంవత్సరాలుగా చెరువులు నిండక ఇబ్బందులు పడుతున్న రైతులకు ఇటీవల కురిసిన వర్షానికి కొర్లకుంట, వైకోట, గోవిందంపల్లి చెరువులు పూర్తిగా నిండాయి. దీంతో రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గురువారం శేషాచల అడవుల్లో కురిసిన భారీ వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.


రంగంపల్లికి జలకళ

పుల్లంపేట : బుధవారం కురిసిన భారీ వర్షాలకు మండలంలోని రెడ్డిపల్లి, రంగంపల్లి చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. చెరువులు నిండటంతో చుట్టుపక్కల గ్రామాలకు సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకపోవడంతో రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'మా పట్టా, పాస్‌పుస్తకాలను ఇప్పించండి'



వీరబల్లి: తమ ఆవేదనను తహసీల్దార్‌కు తెలియజేస్తున్న దళితులు



చిన్నమండెం: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ నరసింహులు

వీరబల్లి : మండలంలోని దిగువరాచపల్లి పంచాయతీలో పెద్ద హరిజనవాడకు చెందిన ప్రజలు తమకు చెందిన పట్టా, పాసు పుస్తకాలు ఇప్పించాలంటూ తహసీల్దార్ శ్రావణిని కోరారు. శుక్రవారం దిగువరాచపల్లి సచివాలయంలో జరిగిన రెవెన్యూ సదస్సులో పెద్దహరిజనవాడ గ్రామస్తులు 50 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌తో వారు మాట్లాడుతూ 2004లో తాము స్పందన ఫైనాన్స్ ప్రైవేటు సంస్థలో భూమిని తనఖా పెట్టి అప్పులు తీసుకున్నామని, అనంతరం ఆ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతుండటంతో సంస్థపై వీరబల్లి కేసు నమోదు చేసి, తమ పట్టాలను, పాస్ పుస్తకాలను వెనక్కి ఇప్పించాలని కోరామన్నారు. దీంతో పోలీసులు విచారణ చేసి తమకు చెందిన పట్టా, పాసు పుస్తకాలను పోలీసులు వీరబల్లి తహసీల్దార్ కార్యాలయానికి అప్పజెప్పారని తహసీల్దార్‌కు తెలియజేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మా పాసుపుస్తకాలు ఎవరిదగ్గర ఉన్నాయో, ఎక్కడ ఉన్నాయో తెలియడం లేదని తహసీల్దార్‌కు చెప్పుకుని మీరే న్యాయం చేయాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ బాధిత రైతులు తమ వద్ద ఉన్న జిరాక్స్ కాపీలు తీసుకువస్తే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నాగులమ్మ, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్నమండెం : మండల పరిధిలోని చాకిబండ గ్రామ సచివాలయంలో రెవెన్యూ గ్రామసభలను శుక్రవారం నిర్వహించినట్లు తహసీల్దార్ నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల నుండి పలు సమస్యలపై 13 అర్జీలు వచ్చాయి. త్వరలోనే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ శ్యామల, ఈఓ కొండారెడ్డి, వీఆర్‌ఓ గంగులయ్య, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రైతన్నకు న్యాయం జరిగేదాకా పోరాటం



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

రాయచోటి : అన్నదాతను దగా చేస్తున్న కూటమి సర్కారు నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ అన్నమయ్య జిల్లా రాయచోటిలో నిర్వహించిన రైతు పోరుబాటలో కర్షకులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు కదం తొక్కారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు శుక్రవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో కలెక్టరేట్ గేట్ నుంచి కార్యాలయం వరకు రైతులు ర్యాలీ చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం కింద రూ. 20 వేలు విడుదల చేయాలని, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని పెద్దఎత్తున నినాదాలతో కలెక్టరేట్ హోరెత్తింది. రైతుల సమస్యలపై కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వైఎస్సార్‌సీపీ నేతలు వినతిపత్రం సమర్పించారు. రైతులకు అండగా అన్నమయ్య జిల్లా నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చారు. కలెక్టరేట్ వద్ద నిర్వహించిన నిరసనలు మిన్నంటాయి. కూటమి ప్రభుత్వానికి అన్నదాతలు ఆక్రందన కనపడలేదా అని ప్రశ్నించారు. ప్రజల గళమై ప్రజల తరపున అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమరదళమయ్యాయి. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి, తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొరముట్ల శ్రీనివాసులు, చింతల రామచంద్రారెడ్డి, మదనపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్ అహ్మద్, రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, మదనపల్లి మున్సిపల్ చైర్మన్ మనూజలు కూటమి ప్రభుత్వం చేపడుతున్న వ్యతిరేక విధానాలను ఎండకట్టారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ అవుల విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షుడు సుకుమార్ రెడ్డి, మండల కన్వీనర్లు జి.జనార్దన్ రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, యదుభూషన్ రెడ్డి, జెడ్పీటీసీలు ఎం.వెంకటరమణ, వెంకటేశ్వరరెడ్డి, రత్నమ్మ (కోడూరు), ఎంపీపీలు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, రాజేంద్రనాథ్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గొర్ల ఉపేంద్ర రెడ్డి, మాజీ ఎంపీపీలు బండి చిన్నరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు కర్ణపు విశ్వనాథరెడ్డి, కొలిమి హరూన్, అవుల నాగభూషణ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజ్ రెహమాన్, రియాజుర్ రెహమాన్, వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజమ్మతోపాటు జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పెద్దఎత్తున రైతులు పాల్గొన్నారు.